# మనోతరంగాలు

శ్రీమతి ఎం. లక్ష్మీదేవి

"ఎవరా వచ్చేవారు ?"

"ఎవరేమిటి? పై అంగవస్త్రాన్ని దులుపుతూ మీద పడేసుకొని ఒంగి నడక సాగించేటప్పుడే తెలియదూ, నాన్నగారని. నేను డబ్బుపంపమని ఉత్తరం వ్రాయగానే ఆయనగారి కోపమంతా అంగవస్త్రాన్ని ఎగిరించారుగాబోలు. డబ్బులేకుండా కాలేజీలో కూర్చుని ఏంచెయ్యడం ?

"పిచ్చి వెధవ. డబ్బు అంటే ఏమనుకొన్నావో?"

"చదువంటె ఏమనుకొన్నారో ?"

"డబ్బు డబ్బుఅని అలా సినిమాలకు కాఫీక్లబ్బులకు ఊరికే తగులెయ్యకపోతే తిన్నగ చదువుకొని రాలేవూ ?"

"డబ్బుంటెగాని చదువురాదు. ఆ రెండుకప్పుల వేడివేడి కాఫీ లోపలపోతేగాని పుస్తకం ముట్టుకోటానికి బుద్ధిపుట్టదు. అదీగాక ఇప్పుడుపరీక్షలు-ఈ రోజుల్లో డబ్బులేకపోతే కాఫీ ఎట్లా దొరుకుతుంది? ఆ కాఫీ లేకపోతే ప్యాసు అయ్యేదెట్లా ? ఏదో రెండు ముక్కలు తెలిసిందో తెలియందో రాస్తేగాని నాలుగు మార్కులు రావు. మార్కులు వస్తేగాని ప్యాసుగాను. ప్యాసయితేగాని ఉద్యోగం దొరకదు. ఉద్యోగం దొరికితేగాని డబ్బుదొరకదు. ఆఖరుకు ఎటుచూచినా డబ్బు డబ్బు"

"నువ్వేం రాజువా ! మహారాజువా ! ఊరికే ఆ కాఫీ త్రాగకపోతేనేం ?"

"ఇంతకంటె నేనేం చెప్పను మా నాన్నకు! రాజులు మహారాజులు. హుం – వాళ్లు మాత్రమే నా మనుష్యులు? "

"ఎవరబ్బాయి ? ఏమిటో రాజులు మహారాజులు అంటున్నావు?"

"ఎవరయ్యా మహానుభావుడా ? ఈ దివ్య రూపంతో ఎక్కణ్ణుంచి దిగావూ ?"

"ఏం ! నా ఇంద్రాయుధంనుంచి ఇప్పుడే దిగాను"

"ఇంద్రాయుధమా ?

"అవును నా గుఱ్ఱం"

"అయితే నీ వెవ్వరు? చంద్రాపీడుడవా ?"

"అవును కనిపెట్టావే"

"మా భాషలో ఇంద్రాయుధం అంటె ఏమిటో తెలుసా ? ఇంద్రుని యొక్క ఆయుధం పేము బెత్తం."

"అంటె ?"

"అంటె, మా బాలవ్యాకరణంలో ఉదహరించాడే 'ప్రహరించెడు వాడు ప్రహర్త' అని అర్థం"

"……………"

"ఏం అట్లా ఆశ్చర్యంగా చూస్తున్నావేం ?"

"నీ మాటలు నాకేమి అర్థంగావటంలేదు"

"ఎట్లాఅర్థమౌతుందీ? నువ్వుమహారాజువి. నాలాగు నాలుగు పరీక్షలు వ్రాసి అయిదు సార్లు ఫెయిలు అయి ఉంటె అప్పుడు నీకు తెలుస్తుంది. ఈ కాలంలో చదువుకోవడం సామాన్యంకాదని. డబ్బులేకపోతే కాఫీరాదు. కాఫీ లేకపోతే చదువురాదు. బుర్ర బ్రద్దలు కొట్టుకొని రెండు ఆన్సర్లు వల్లిస్తే అవే ప్రశ్నలురావు. వచ్చిన ప్రశ్నలకు ఆన్సర్లు తెలియవు.

అంతా తంత్రంలో ఉంది కార్యసిద్ధి. మూడురోజుల నుంచి శుకనాసోపదేశం వల్లిస్తున్నాను వల్లిస్తున్నాను కాని ఏమి బొత్తిగా బోధపడటంలేదు."

"ఏమన్నావు? శుకనాసుడా! మా ప్రధాన మంత్రిగారా!"

"ఓహోహో! ఎదురుగా నుంచున్నది చంద్రాపీడుడుగదా! ఎంతలో మర్చిపోయాను. ఇంకేం రొట్టె విరిగి పాలలో పడింది. సరేగాని ఆరోజు శుకనాసుడు నీకేం ఉపదేశించాడో దాన్ని ఉన్న దున్నట్లు చెప్పగలవా?"

"దీనికేం - చెప్పుతాను"

"సరే చెప్పు. నేనలాగే వ్రాసుకొంటాను" శుకనాసుని ఉపదేశము, శీర్షిక చెప్పు"

"వ్రాసుకో నాయనా! చంద్రాపీడుడా! సకల శాస్త్రములను తెలిసికొన్ననీకు నేను కొంచము గూడ నుపదేశింపదగినది లేదు. స్వభావసిద్ధముగనే యతి గహనమైన యజ్ఞాన రూపమైన యౌవన ప్రాదుర్భావము. భానువు చేత భేదింపఁదగనిదిగాను, దీపముల కాంతులచే పోగొట్టబడనిదిగా నున్నది. దారుణమైన లక్ష్మివలన కల్గినమదము పరిణామముల చేత కూడను నశింపదగినదికాదు. ధనము వలన కల్గిన యజ్ఞానాంధత్వమును ఏయంజనము చేతను సాధింపదగినదికాదు. కనుక విపులముగా జెప్పుచున్నాను. ఆగర్భ శ్రీమంతత్వము, నూతన యౌవనము. సాటిలేని సౌందర్యము, మానవాతీత శక్తి సామర్థ్యములు, ఒక్క వ్యక్తియందు ప్రత్యేకముగా నుండిననే యనేకనర్థములను వాటిల్లజేయును ఇకయంతయు నొక్కచో గూడిన జెప్పనేల? యౌవనారంభమునందు తలచుగా శాస్త్రజలప్రక్షాళనచే శుద్ధమైన బుద్ధికూడ కాలుష్యమును పొందుచున్నది. ఎండుటాకుల కుప్ప వాయుప్రసారముచే అన్ని దిక్కులందు వీచబడుచున్నట్లు ప్రకృతికూడ పురుషుని యౌవన సమయమందు నిలుకడలేకుండ త్రోసివేయును. విషయాసక్తికల్గి చెడుమార్గప్రవృత్తికల పురుషుని దిగ్భ్రాంతునిజేసి నశింపజేయును. ఉపదేశమునకు మీవంటివారే తగియున్నారు. మాలిన్య రహితమైన మనస్సునందు చంద్రునికిరణములుస్ఫటిక మణియందు వలె సులభముగా సదుపదేశములు ప్రవేశించుచున్నవి.

దుర్మార్గునికి జ్ఞానప్రదమన సరువచనముకూడ సలిలము కర్ణశూల పుట్టించునదివలె నుండును. సన్మార్గునికి శంఖాభరణము గజాననమునకు శోభను గల్గించుచున్నట్లు అధికమగు శోభను గల్గించును. ధనమదాంధునికి కులీనతగాని, పాండిత్యముకాని వినయమునకు కారణముగాదు. మంచి గంధమువలన పుట్టిన యగ్ని ఇతరవస్తువులను దహింపదా? పురుషులకు సదూపదేశము మలినమును పోగొట్టు స్నానము వంటిది. బంగారముతో చేయబడని కర్ణాభరణము వంటిది. ప్రజలు నడవడికలందు రాజునే యనుసరించెదరు.

మంగళ స్వరూపుడవగు నీవు మొదట లక్ష్మి

## పిల్లల ఆహారం

పిల్లలకు ప్రత్యేకమైన అహార పదార్థాలను ఉత్పత్తి చేసేందుకు అనంద్‌లోని కైరా జిల్లా క్షీరోత్పత్తి దార్ల సంస్థ తలపెట్టిన పథకానికి భారత జాతీయ పరిశోధనల అభివృద్ధి సంస్థ ఆమోదం తెలిపింది. ఈ పథకం నిర్వహణకు పదివేల రూపాయల మొత్తం ఖర్చు అవుతుంది. మైసూరులోని కేంద్ర అహార విజ్ఞాన పరిశోధనా సంస్థ నిర్వహించిన పరిశోధనలు ఆధారంగా పై సంఘం పిల్లల ఆహారాన్ని తయారు చేస్తుంది.

స్వభావమును చూడుము. ఈ లక్ష్మి పాలసముద్రము నుండి చంద్రుని వక్రభావమును, ఉచ్చైశ్రవము యొక్క చంచలత్వమును, కాలకూటము నుండి మోహనశక్తిని, మద్యమునుండి మదమును, కౌస్తుభ మణియొక్క నయతర కర్కశత్వము ఈ మొదలుగా గల చిహ్నములను గ్రహించి పుట్టినది. ఈ దుష్ట లక్ష్మిచేత ఈ జగత్తునందు పరిచితముకాని వస్తువు లేదు. పొందబడినప్పటికి మిక్కిలి కష్టముగా రక్షింపబడుచున్నది. దృఢమైన గుణపాశములచేత కట్టుటవలన నిశ్చలముగా నున్నప్పటికి మాయమగు చున్నది. చిరపరిచయముకలవారిని నిరీక్షించదు. వంశ పారంపర్యముగా నున్నను చూడదు. శీలమును చూడదు. శాస్త్రమును వినదు. ధర్మగుణము ననుస రించుటలేదు. దానగుణము కలవారి ననుసరించదు. విశేషతెలివిగలవానిని విచారింపదు. గాలిలో మేడల వలె చూచుచుండగనే మాయమగుచున్నది.

చంచలమైన ఈ లక్ష్మి ఎట్లు ప్రకాశించు చున్నదో కాని దీపశిఖవలె మలినమునే పుట్టించు చున్నది. ఆశ యనెడి విషలతను పోషించు నీటి ప్రవాహము వంటిది. ఇంద్రియములనెడి మృగము లకు కిరాతగానము వంటిది. అజ్ఞాన దీర్ఘ నిద్రకలవార లకు విలాసశయ్యవంటిది. దుష్టసర్పనివాసమునకు గుహవంటిది. ఈ జగత్తుయొక్క కపటనాటకమునకు నాందీముఖము. ధర్మమనెడి చంద్రమండలమునకు రాహువువంటిది.

పట్టాభిషేక సమయమందు రాజులయొక్క దాక్షి ణ్యము మంగళకలశ జలముచేత కడుగబడుచున్నది. అగ్నికార్య ధూమముచేత హృదయము మలినముగాఁ జేయబడుచున్నది. జరాగమన సూచకమగు తలపాగా పట్టబంధములచేత కప్పబడుచున్నది. పరలోక వాంఛ గొడుగుల సమూహముచేత అడ్డగింపబడుచున్నది. సత్యవాదిత్వము వింజామరల గాలులచేత ఎగురవేయ బడుచున్నది. మంచి గుణములు వేత్రదండములచేత చితుకగొట్టబడుచున్నవి.

ఎవడు రాత్రింబగళ్లు యెల్లప్పుడు నమస్కారము చేయుచు దేవునివలె స్తోత్రింపబడునో, ఎవడు వాని గొప్ప తనమును జెప్పునో, వానితో మాట్లాడు చున్నారు. వానిని ప్రక్కన జేర్చుకొనుచున్నారు. వానితోకూడ సుఖముగా నున్నారు. పట్టాభిషేకము జరిగిన తర్వాత సప్తద్వీప గర్భితమగు భూమిని జయిం పుము. త్రిలోకమునుఁ జూచుచున్న సిద్ధునివలె నుండుము" అని చెప్పెను.

"భలే! భలే! మంచి ట్రాన్సులేషన్, ఈ ప్రశ్న వచ్చిందంటె ఫస్టుమార్కు కొట్టేస్తాను. సరే గాని నువ్వేమో మహాశ్వేతకు సహగమనంనుండి విర మించడానికి ఏమో ఉపదేశించావట, అ ముక్క కూడ కాస్త చెప్పేద్దూ ?"

"సరే! చెప్తాను. వ్రాసుకో, - అదేం గంట కొట్టుంది ?"

"ఓ అదా! సైకిలుబెల్, మా స్నేహితుడు వచ్చాడనుకొంటాను."

"సైకిలు, అంటె !"

"అదా, మా యింద్రాయుధం"

"అరరే! నా ఇంద్రాయుధం ఎక్కడా ?"

"మా గ్రౌండులో పచ్చిగడ్డిని చూసిందేమో !"

"ఏమిట్రావాగుడు ? ఎందుకురా పచ్చిగడ్డి !" ఒక్కదెబ్బ కొట్టాడు రాఘవం.

ఉలిక్కిపడి కళ్ళుతెరిచాను. చేతులోఉన్న కాదంబరీ పాఠ్యపుస్తకము క్రిందపడింది.

—:o:—